ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
మంచిర్యాల
జిల్లా వార్తలు



నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చెన్నూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరా యం ఉంటుందని విద్యుత్ ఏస్ఈ గంగాధర్, డీఈ కైసర్, ఏడీఈ బాలకృష్ణలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చెన్నూరు సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ ఉండదని తెలిపారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

ఇంటర్ కళాశాల లేక ఇక్కట్లు..

- అమలుకు నోచుకోని హామీ
- ఉన్నత విద్యకు దూరమవుతున్న పేద విద్యార్థులు
- ఇంటర్ కళాశాల ఏర్పాటు చేయాలని వేడుకోలు

5

అటవీ ఉత్పత్తులతో ఆదాయం

- ఇప్పపూలు, జీడి గింజల సేకరణ
- ఉపాధి పొందుతున్న గిరిజనులు

4

అందని.. అత్యవసరం

జిల్లా జనరల్ ఆసుపత్రిలో అత్యవసర చికిత్స కరువు



ఆసుపత్రిలో గదులులేక వరండాలో చికిత్స పొందుతున్న రోగులు (ఫైల్)



జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి

- ప్రతి రోజూ పదుల సంఖ్యలో రోగుల రెఫర్
- డెలివరీలకూ ఇతర ప్రాంతాలకు తరలింపు
- ఆసుపత్రిలో వేధిస్తున్న వైద్యుల కొరత
- గాల్లో కలుస్తున్న రోగుల ప్రాణాలు

మంచిర్యాల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అత్యవసర వైద్య చికిత్సలకు గ్యారెంటీ లేకుండా పోయింది. కావాల్సిన వైద్యనిపుణులు, అవసరమైన సాంకేతిక, అధునాతన వైద్యసామగ్రి అందుబాటులో లేకపో వడంతో ఇతర ప్రాంతాలకు రెఫర్ చేయడం ఇక్కడ నిత్యకృత్యం అయింది. అదృష్టం బాగుండి ఇతర ప్రాంతాలకు సకాలంలో చేరితే సరి....లేదంటే ప్రాణాలు గాల్లో కలవాల్సిందే. జిల్లా కేంద్రం నుంచి కరీంనగర్, వరంగల్‌తోపాటు హైద్రాబాద్ ప్రాంతాలకు ఇక్కడి రోగులు నిత్యం పదుల సంఖ్యలో వైద్యంకోసం వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లా కేంద్రం నుంచి ఆయా ప్రాంతాలకు వెళ్లాలంటే కనీసం రెండు నుంచి నాలుగు గంటలు పడుతున్నది. ఈ క్రమంలో మార్గ మధ్యలో ప్రాణాలో కోల్పోతున్న వారి సంఖ్య అధికం గానే ఉంటోంది.

రెఫర్..రెఫర్..రెఫర్

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రితోపాటు, పలు మల్టీ స్పెషాలిటీ హాస్పిటళ్లలో సైతం పూర్తిస్థాయిలో చికిత్స అందడంలేదు. డెం గ్యూ, గుండె పోటు, తదితర విభాగాల అత్యవసర చికిత్సల కోసం కరీంనగర్, హైద్రాబాద్‌కు వెళ్లాల్సిందే. డెలివరీలు మొదలుకొని పాము కాటు, హైపర్ టెన్షన్, రోడ్డు ప్రమాదాలు, విద్యుత్‌షాక్, విష ప్రభావం, తదితర తీవ్రమైన కేసుల్లో ఇతర ప్రాంతాలకు రెఫర్ చేయడం పరిపాటిగా మారింది. ఖర్చులకు వెనకాడని ప్రజలు మల్టీ స్పెషాలిటీ ఆసుత్రుల్లో చేరుతున్నప్పటికీ అత్యవసర పరిస్థితుల్లో రెండు, మూడు రోజులకంటే ఎక్కువగా స్థానికంగా చికిత్స అందించలేకపోతున్నారు. పరిస్థితి విషమించిందనుకుంటున్న సందర్భాల్లో ఇతర ప్రాంతాలకు రెఫర్ చేస్తున్నారు.

రోగులకు భరోసా ఏదీ....?

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అత్యవసర పరిస్థితుల్లో రోగులకు భరసా ఇవ్వలేని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతోంది. జిల్లాలో వందల సంఖ్యలో ప్రైవేటు ఆసుపత్రులున్నా పూర్తిస్థాయిలో రిస్క్‌తీసుకోలేని పరిస్థితి. మల్టీస్పెషాలిటీ ఆసుపత్రులు నెలకొల్పుతున్నా అత్యవసర సమయాల్లో రెండు, మూడు రోజులకు మించి రోగిని ఉంచుకొని చికిత్స అందించే ధైర్యం చేయలేకపోతున్నారు నిర్వాహకులు. పూర్తిస్థాయిలో వైద్య పరికరాలు అందుబాటులో లేకపోవడం...రోగి ప్రాణాలకు ముప్పు వాటిల్లిన పక్షంలో అతని బంధువుల నుంచి వచ్చే ఇబ్బందులు దీనికి కారణంగా నిలుస్తున్నాయి. దీంతో ఆయా ఆస్పత్రుల్లో వైద్యులు చేతులెత్తేస్తున్నారు. అత్యవసర సమయాల్లో రెండు మూడు రోజులు చూసి వెంటనే కరీంనగర్ లేదా హైద్రాబాద్‌కో తరలించి, చేతులు దులుపుకుంటున్నారు. మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాలకు చెందిన ప్రజలు వైద్యంకోసం అత్యధికంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రితోపాటు పలు ప్రైవేటు ఆసుపత్రులపైనే ఆధారపడతారు. రెండు జిల్లాలతోపాటు పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్రలోని సిరొంచా తాలుకాకు చెందిన ప్రజలు సైతం ఇక్కడికే వస్తుంటారు. అయినప్పటికీ ఇక్కడ వైద్య చికిత్సలో ఆశించినమేర భరోసా కానరావడం లేదు.

వేధిస్తున్న వైద్యుల కొరత..

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వైద్యుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఇక్కడ నిత్యం ఓపీ 400పై చిలుకు ఉంటోంది. కేవలం డెలివరీల కో సమే వంద మంది వరకు ఇన్‌పేషెంట్‌గా చేరుతుం టారు. అయితే ఇంత మందికి వైద్య సేవలు అందిం చేందుకు ప్రస్తుతం...

మిగతా 5 లో..

గ్రామంలో తాగునీటి ఎద్దడి



తాగునీరు తెచ్చుకుంటున్న ఎస్టీ కాలనీ వాసులు

కోటపల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బ్రహ్మణపల్లి గ్రామంలో తాగునీటి ఎద్దడి నెలకొంది. ఈ గ్రామంలోని ఎస్టీ కాలనీకి తాగునీరు సరఫరా చేసే బోరు బావి విద్యుత్ మోటారు వారం రోజుల క్రితం చెడిపోవడంతో ఈ నీటి ఎద్దడి ఏర్పడింది. విద్యుత్ మోటారు చెడిపోయిందని అధికారులు చెబుతున్నా ఎవరు పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆరోపించారు. మరో వైపు ఈ కాలనీలో మిషన్ భగీరథ నీటి సరఫరా సైతం నిలిచిపోవడంతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో కాలనీ వాసులు సమీపంలోని బోరు వద్ద నుంచి బిందెలు, కుండలతో నీటిని తెచ్చుకుంటున్నారు. దీంతో ఇబ్బందుల పాలవుతున్నామని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు స్పందించి విద్యుత్ మోటారును బాగు చేయించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

అందాల పోటీలను రద్దు చేయాలి

శ్రీరాంపూర్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో నిర్వహించే అందాల పోటీలను రద్దు చేయాలని పీఓడబ్ల్యూ(స్త్రీ విముక్తి) మంచిర్యాల జిల్లా కన్వీనర్, ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి మేకల పోచమల్లు డిమాండ్ చేశారు. నస్పూర్ సీఈఆర్ క్లబ్‌లో మహిళల ఆధ్వర్యంలో నిరసన తెలుపగా, మే నెల 7వ తేదీ నుంచి 31వ వరకు హైదరాబాద్‌లో ప్రభుత్వం ప్రపంచ సుందరి(మిస్ వరల్డ్) పోటీలు నిర్వహించడం సరికాదన్నారు. చాకలి ఐలమ్మ, మల్లు స్వరాజ్యం, అరుట్ల కమల, రంగవల్లి స్వర్ణక్క, బెల్లి లలిత లాంటి వీరనారీమణులు పుట్టిన నేల తెలంగాణ అని అన్నారు. ఎన్నో పోరాటాలకు ఇక్కడే నాంది పడిందన్నారు. ఇలాంటి నేలలో మహిళలను అంగడి సరుకుగా చూపిస్తూ అందాల పోటీలు నిర్వహించడం శోచనీయమన్నారు. వాటిని వెంటనే రద్దు చేసి, మంజూరు చేసిన డబ్బులను ఇతర సంక్షేమ కార్యక్రమాలకు వినియోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యూ(స్త్రీ విముక్తి) నాయకులు లావణ్య, రాజేశ్వరి, త్రివిధ్య, మౌనిక, స్రవంతి, ఏఐఎఫ్‌టీ యూ నాయకుడు రాజ్‌కుమార్, పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

మంచిర్యాలక్రైం, ఏప్రిల్9(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఇంటర్మీడియట్ స్పాట్ వాల్యుయేషన్ ప్రశాంతంగా ముగిసింది. బుధవారం వాల్యు యేషన్‌కు సహకరించిన తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ ఆధ్వర్యంలో సన్మానం చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు ప్రసాద్ మాట్లాడుతూ స్పాట్‌వాల్యుయేషన్‌కు సహకరించిన అందరికి అభినందనలు తెలుపుతూ సన్మానించారన్నారు. ఈ కార్యక్రమంలో జీఐఈవో అంజయ్య, క్యాంప్ జనరల్ నాగచందర్‌రావు, సతీష్, సీసీవో ఆవునూరి అంజయ్య, లెక్చరర్ సంఘం 475బాధ్యులు నాయిని శ్రీనివాస్, కోశాధికారి సోమయ్య, నవీన్ రెడ్డి, అశోక్, జ్ఞానేశ్వర్, బావాజీ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ కార్మిక సంఘం(ఏఐటీయూసీ అనుబంధం) మం చిర్యాల జిల్లా పట్టణ నూతన కమిటీని బుధవారం మంచిర్యాలలోని సీపీఐ పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి జాడి పోశం అధ్యక్షతన ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా శాతం సుమన్, ఉపాధ్యక్షులుగా చీకటి సత్యనారాయణ, శివవర్ధన్ ,కార్యదర్శిగా పొనగంటి ఏసేపు, సహాయ కార్యదర్శులుగా భూపెల్లి నరేష్, గడ్డం మధు, కోశాదికారిగా స్వామి, సభ్యులుగా యాకోబు, జీవన్, తిరుమలేష్, రమేష్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

మంచిర్యాల క్రైం, ఏప్రిల్9 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల ఎస్ఎస్‌సీ పదోతరగతి స్పాట్ వాల్యుయేషన్ మంచిర్యాల సెంటర్‌లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు, సిబ్బందికి డీటీఎఫ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. డీఈవో యాదయ్య చేతుల మీదుగా ప్రారంభించారు. సుమారు 700మందికి పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆసంపల్లి రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి మోతె జయక్రిష్ణ, ఉపాధ్యక్షులు కుమార్, కార్యదర్శులు ప్రకాశ్, సురేష్, రాష్ట్ర కౌన్సిలర్ జాకీర్, వివిధ మండలాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

ఎంపీ వంశీకృష్ణ, ఎమ్మెల్యే వివేక్



యాత్ర నిర్వహిస్తున్న ఎంపీ వంశీ, ఎమ్మెల్యే వివేక్

మందమర్రి టౌన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి) : భార త రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేద్కర్‌పై హోం మంత్రి అమిత్‌షాతో పాటు ఆ పార్టీకి చెందిన ఇతర నాయకులు అనుచిత వాఖ్యలు చేయడం సరికాదని, దీనిని దేశ ప్రజలు క్షమించరని పెద్దపల్లి ఎంపీ గ డ్డం వంశీకృష్ణ, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వా మి పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఇచ్చిన ఆదేశాల మేరకు బుధవారం మందమర్రిలో నిర్వహించిన రాజ్యాంగ పరిరక్షణ యాత్రకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాత బస్టాండ్‌లో గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం యాత్ర ఆయా కాలనీల మీదుగా చేపట్టారు. జై భీం నినాదాలతో అంబేద్కర్‌తో పాటు గాంధీ, రాజ్యాంగ పుస్తకం చేత పట్టుకొని ఈ ర్యాలీ కొనసాగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడో సారి అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం రాజ్యాంగ తిలోదకాలు ఇస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహ రిస్తుందని మండి పడ్డారు. అంబేద్కర్ లేకపోతే దేశంలో ప్రజాస్వామ్య పార్లమెంటరీ వ్యవస్థ ఏర్పడేదా అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యాంగ పరి రక్షణ యాత్ర మందమర్రి కోఆర్డినేటర్ అంజన్‌కుమార్‌తో పాటు జిల్లా, పట్టణనాయకులు నోముల ఉపేందర్, సొత్కు సుదర్శన్, రమేష్, లక్ష్మణ్, రజిణి, నెర్వెట్ల శ్రీనివాస్, సంగి సదానందం, మండ భాస్కర్, రాచర్ల రవి, సట్ల సంతోష్, ఆకారం రమేష్, గణేష్, పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల పాదయాత్ర

నస్పూర్ : విలేజ్ నస్పూర్ బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయ కులు జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి నూకల రమేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ సుర్మిళ్ల వేణు, యువజన కాంగ్రెస్ జిల్లా మాజీ అధ్యక్షుడు సంపత్ రెడ్డిలతో పాటు వివిధ వార్డులకు చెందిన మాజీ కౌన్సిలర్లు, యువజన కాంగ్రెస్ నాయకులు, మహిళ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కులాలు, మతాల మధ్య కేంద్రం చిచ్చు

ఎంపీ గడ్డం వంశీకృష్ణ

మందమర్రిటౌన్, ఏప్రిల్ 9(ఆంధ్ర జ్యోతి): కులాలమతాల మధ్య చిచ్చు పెడుతూ రాజ్యాంగాన్ని లేకుండా చేసే కుట్రలను కేంద్ర ప్రభుత్వం పాల్పడుతోందని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ తెలిపారు. బుధవారం మందమర్రిలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాసమస్యలపై మాట్లాడే ప్రతిపక్షాల గొంతునొక్కుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం అంబేద్కర్ రాజ్యాం గాన్ని టార్గెట్‌గా చేశారని ఆయన మండిపడ్డారు. కేంద్రం హోం మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసనగా రాజ్యాంగ పరిరక్షణ యాత్రకు తమ పార్టీ పిలుపుని చ్చిందని తెలిపారు. తమ అధినేత రాహుల్ గాంధీ దేశ ఐక్యతకోసం భారత్ జోడోయాత్ర కూడ చేప ట్టారని, ఈ యాత్ర ప్రభావం చూపిందన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు, కార్య కర్తలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే రక్తహీనత దూరం

దండేపల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గర్బిణులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతను నివారించవచ్చునని దండేపల్లి సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ల ముత్యం రమాదేవి సూచించారు. బుధవారం పోష ణ పక్వాడ్ పక్షోత్సవాల సందర్భంగా దండేపల్లి సెక్టార్ పరిధిలోని నర్సాపూర్ 1, 2వ అంగన్‌వాడీ కేంద్రాలలో పోషకాహారంపై అవగాహన కల్పించారు. బిడ్డ రెండు సంవత్సరాలు నిండే వరకు తల్లులు తీసుకోవాల్సిన జాగ్రత్తలుపై వారికి వివరించారు. మొదటి వెయ్యి రోజులు పిల్లల ఎదుగుదలకు ఎంతో ప్రాధాన్యత ఉందని, వారికి ఎలాంటి మానసిక,శరీర సమస్యలు ఎదురుకాకుండా ఉండేం దుకు సరైన పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలన్నారు. పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగించడం వల్ల రోగ నిరోదక శక్తిపెరిగి పిల్లలు ఆరోగ్యంగా ఉంటారన్నారు.

గర్భిణుల ఎత్తు బరువు వంటి కొలతలు వేసి నమోదు చేసుకున్నారు. అనంతరం పౌష్టికాహారం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఎన్ఎం లావణ్య, అంగన్ వాడి టిచర్ల పుర్రేళ్ల భాగ్యలక్ష్మి, రాధ, ఆశలు, గర్బిణిలు,బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

కాసిపేట : మండలంలోని తిర్మలాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలోని పోషణ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపర్ వైజర్ రాధిక గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, ముర్రుపాల ప్రాముఖ్యత గురించి వివరించారు. హ్యాండ్ వాష్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పోషణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ లలిత, హెల్పర్ లక్ష్మీ, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.



నర్సాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి

చెన్నూరు : చెన్నూరులోని బట్టిగూడెం, చింతలగూడెం అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం పోషణ పక్వాడా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. డాక్టర్ రాధాకృష్ణ గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, ముర్రుపాల ప్రాముఖ్యత గురించి వివరించారు. అనంతరం పోషణ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్ సువర్ణ, టీచర్లు సావిత్రి, ఉమామహేశ్వరి, హెల్పర్లు లక్ష్మీ, పోసక్క, తల్లులు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

నాణ్యమైన ఏకరూప దుస్తులు అందించాలి

- కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు జూన్ మొదటి వారంలోగా పాఠశాలలకు కేటాయించిన మేర నాణ్యమైన ఏకరూప దుస్తులు అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో డీఈవో యాదయ్య, డీఆర్‌డీవో కిషన్‌తో కలిసి ఎంఈవోలు, ఏపీ ఎంలతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఏకరూప దుస్తుల తయారీ ప్రక్రియను వేగవంతం చేయాలని, మే నెల 20లోగా దుస్తులు సిద్ధం చేసే విధంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఏకరూప దుస్తుల తయారీ కోసం మహిళా స్వయం సహాయక సంఘాలకు అవకాశం కల్పించామని, కొన్ని ప్రాంతాల్లో కుట్టు మిష న్లను కూడా అందించామన్నారు. ఒక జత దుస్తులకు రూ.75 చెల్లిస్తామని, నాణ్యతతో దుస్తులను కుట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ సమన్వయకర్త చౌదరి, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోండి



స్థానికులకు సూచనలు ఇస్తున్న సీఐ వేణుచందర్

శ్రీరాంపూర్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి) : అన్నివార్డుల ప్రజలు సీసీకెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ అన్నారు. కృష్ణకాలనీలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. సీసీ కెమెరాలతో సమాజంలో జరుగుతున్న నేరాలను అరికట్టేందుకు వీలుకలుగుతుందన్నారు. త్వరితగతిన దోషులను పట్టుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. కాలనీ ప్రారంభంలో, చివరలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎస్ఐ సంతోష్, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్

నెన్నెల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ అన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు అంగలి శేఖర్ అధ్యక్షతన మండలంలోని గొల్లపల్లిలో బుధవారం నిర్వహించిన క్రియాశీల సభ్యులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం నిధులతోనే ప్రజలకు ఉచిత బియ్యం, సీసీరోడ్లు నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. రాష్ట్రప్రభుత్వ పథకాలుగా కాంగ్రెస్ నాయకులు చేసుకుంటున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. డీలర్‌షాపుల వద్ద ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటాన్ని ఏర్పాటు చేయాలన్నారు. బూత్‌స్థాయిలో పార్టీని బలోపేతంచేసి, గ్రామాల్లోని సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం కృషి చేయాలని సూచించారు. జిల్లాపార్టీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన అనంతరం మొదటి సారిగా మండలానికి వచ్చిన వెంకటేశ్వర్‌గౌడ్‌ను మండల పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి నియోజకవర్గ కన్వీనర్ రాచర్ల సంతోష్, నాయకులు కోటవంశీ, శైలెందర్‌సింగ్, యాదగిరి, గడ్డం శ్రీనివాస్‌గౌడ్, రత్న అరుణ్, కొడిపే మహేందర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్

బూత్‌స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలి

కన్నెపల్లి : బీజేపీని బూత్ స్థాయిలో బలోపేతం చేయాలని జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం కన్నెపల్లిలో క్రియాశీల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే అత్యధిక సభ్యత్వం కలిగి ఉన్న పార్టీ బీజేపీ అని తెలిపారు. పార్టీ ఆవిర్భావ వేడుకలను ఘనంగా జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచు పుల్లూరి రాజయ్య, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు బర్ల పోశన్న పాల్గొన్నారు.

భీమిని : మండలంలో పార్టీ బలోపేతానికి ప్రతీఒక్క కార్యకర్త కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని బిట్టూరుపల్లి గ్రామంలో కీయాశీల సభ్యులు, కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు కొంక సత్యనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఏమాజీ, బెల్లంపల్లి అసెంబ్లీ కన్వీనర్ రాచర్ల సంతోష్, పురుషోత్తం గౌడ్ పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగి ఇంట్లో చోరీ

- రూ.70 వేల నగదు అపహరణ



ఫింగర్ ప్రింట్స్ సేకరిస్తున్న పోలీసులు

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని మాతృశ్రీ డిగ్రీ కళాశాల సమీపంలోని విశ్రాంత ఉద్యోగిని కొలిపాక వరలక్ష్మి నివాసంలో బుధవారం చోరీ జరిగింది. బాధితురాలి కథనం ప్రకారం... వరలక్ష్మి పనినిమిత్తం మంగళవారం తమ కుమార్తె గ్రామమైన కెరమెరి మండలానికి వెళ్లారు. కాంపౌండ్‌వాల్‌కు సంబం ధించిన గేట్లకు వేసిన తాళం, ప్రధాన ద్వారం తలుపులకు సంబంధించి బెడం పగలగొట్టి ఉండడాన్ని బుధవారం ఉదయం వరలక్ష్మి కోడలు కవిత గమనించారు. వెంటనే వరలక్ష్మికి ఫోన్‌లో సమాచారం అందించారు. వరలక్ష్మి ఇంటికి చేరుకుని గమనించగా ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. అత్యవసర పనుల నిమిత్తం బీరువాలో దాచి ఉంచిన రూ.70 వేల నగదును అపహరించినట్టు గుర్తించారు. విషయం తెలుసుకున్న సీఐ బి రవీందర్ సంఘటన స్థలానికి చేరుకుని ఫింగర్ ప్రింట్ పోలీసు అధికారులతో పలు ఆధారాలను సేకరించారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

5.5 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

కెరమెరి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కెరమెరి మండలం బారెమోడి గ్రామ సమీపంలో వాహనాల తనిఖీల్లో భాగంగా బుధవారం మహారాష్ట్రకు ఆటో(టీఎస్20 టీ4156)లో అక్రమంగా తరలిస్తున్న 5.5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు బియ్యాన్ని స్వాధీన పర్చుకుని ఝరి గ్రామానికి చెందిన మేరాజ్‌ఖాన్, షేక్ మహబూబ్, సమీర్‌ఖాన్‌లపై కేసు నమోదు చేసి ఆటోను సీజ్ చేసినట్లు తెలిపారు. పట్టుకున్న బియ్యం విలువ రూ.11 వేలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

ఛత్తీస్‌గఢ్‌లో నస్పూర్ వాసి మృతి

నస్పూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లోని అమృత ధార జలపాతంలో మంగళవారం ప్రమాదశాత్తు నీటిలో మునిగి నస్పూర్‌కు చెందిన దొరిశెట్టి పృథ్వీరాజ్ (33) అనే యువకుడు మృతి చెందాడు. స్థానికులు, నేతలు చెప్పిన వివరాల ప్రకారం... పృథ్వీరాజ్ ఛత్తీస్‌గఢ్‌లో సౌత్ ఈస్టర్న్ కోల్ ఫీల్డ్స్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. తోటి అధికారులతో కలిసి పిక్నిక్ వెళ్లారు. పృథ్వీరాజ్‌తో పాటు మరో వ్యక్తి కూడా ఈ ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడి తండ్రి ఐఎన్‌టీయూసీ నాయకుడు దొరిశెట్టి తిరుపతి ఎస్ఆర్‌పీ-3 గనిలో సపోర్టుమెన్‌గా పని చేస్తూ గోదావరి కాలనీలో నివాసం ఉంటున్నాడు. పృథ్వీరాజ్ ఉద్యోగం రీత్యా ఛత్తీస్‌గఢ్‌లో నివాసం ఉంటున్నాడు. మృతుడికి తల్లిదండ్రులతో పాటు భార్య, కూతురు ఉన్నారు. బుధవారం అర్ధరాత్రికి మృతదేహం నస్పూర్‌లోని గోదావరి కాలనీకి చేరుకుంటుంది. గురువారం ఉదయం ఇక్కడ అంత్యక్రియల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రమాద విషయం తెలుసుకున్న స్థానిక ఐఎన్‌టీయూసీ నాయకులు శంకర్‌రావు, రిక్కల గోపాల్‌రెడ్డి, పలువురు నేతలు ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



మహేష్ (ఫైల్)

భీమారం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : భీమారం మండల కేంద్రంలోని బీసీ హాస్టల్ సమీపంలో నివాసం ఉంటున్న గొల్లపల్లి మహేష్ (32) అనే యువకుడు వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మహేష్ ఈ నెల 6న శ్రీరామనవమి రోజున మండలంలోని సుద్దాల గ్రామంలో ఉన్న రామాలయానికి వెళ్లాడు. ఈ క్రమంలో కిష్టంపేట సమీపంలో చెన్నూరు మంచిర్యాల రహదారిపై ప్రమాదానికి గురయ్యాడు. గమనించిన ప్రయాణికులు వెంటనే అతన్ని వాహనంలో మంచిర్యాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్వేత తెలిపారు.

అటవీ ఉత్పత్తులతో ఆదాయం



ఇప్పపూలు సేకరిస్తున్న గిరిజన వృద్ధురాలు

- ఇప్పపూలు, జీడి గింజల సేకరణ
- ఉపాధి పొందుతున్న గిరిజనులు

కెరమెరి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అడవులనే నమ్ముకుని అడవే ఆధారంగా జీవిస్తున్న ఆదివాసీలు తమ సంప్రదాయ అటవీ ఉత్పత్తులను మరవడం లేదు. అడవితల్లి ఏదో ఒక రూపంలో వారికి ఆసరా కలిగిస్తోంది. ఇప్పపూలు, జీడిగింజలు, తునికి పండ్లు, మొర్రి పండ్లు, సారా పలుకులు అందిస్తూ వారిని కొంత ఆర్థికంగా బలపడేలా చేస్తోంది. వాటిని సేకరించేందుకు ఆదివాసీలు వేకువజామునే నిద్ర నుంచి మేల్కొని పిల్లాపాపలతో కలిసి అడవిబాట పడుతున్నారు.

ఉమ్మడి జిల్లాలోని కెరమెరి, ఉట్నూర్, ఇంద్రవెల్లి, నార్నూర్, జైనూరు, సిర్పూర్(యూ), లింగాపూర్, వాంకిడి, తిర్యాణి, జన్నారం, దండేపల్లి, బోథ్, ఇచ్చోడ, బేల, బజార్‌హత్నూర్, బెజ్జూరు, సిర్పూర్ (టి) మండలాల గ్రామాల సమీపంలోని అడవుల్లో అటవీ ఉత్పత్తులు లభిస్తున్నాయి.

ముఖ్యంగా కెరమెరి మండలంలో అధికంగా అడవులు ఉండడం వల్ల సాకడ, సాంగ్వి, కొప్పగూడ, పిట్టగూడ, కేలి(కె), లెండిగూడ, మెట్టపిప్పిరి, మోడి, చాల్‌బాడి, జోడేఘాట్, పాట్నాపూర్ గ్రామాల ఆదివాసులు తెల్లవారు జాము నుంచి మధ్యాహ్నం వరకు ఇప్పపూలు, జీడి గింజలు సేకరించడంలో నిమగ్నమవుతున్నారు. మరికొద్ది రోజుల్లో తునికాకు సేకరణ కూడా ప్రారంభం కానుంది.

ఆర్థికంగా వెసులుబాటు :

వేసవి కాలం వచ్చిందంటే గిరిజనులకు పండుగే. ఈ కాలంలో ఇప్పపూలు విరివిగా లభిస్తాయి. వేకువ జామునే అడవికి వెళ్లిన ఆదివాసీలు ఇప్పపూల చెట్లకింద గంటల తరబడి కూర్చుని వాటిని సేకరించి మార్కెట్‌లో విక్రయిస్తారు. జీడిగింజలు మార్కెట్‌లో కిలోకు 30 రూపాయలు పలుకుతోంది.

ఆశించిన ధర లేక..

ఇప్పపూలను బుట్టలో ఏరుతారు. అనతరం పూలను ఇంటికి తీసుకువచ్చి ఎండలో ఆరబెట్టి మార్కెట్‌లో విక్రయిస్తారు. ప్రస్తుతం అత్యధిక గ్రామాల్లో ఏ ఇంటికి వెళ్లినా ఇప్పపూలు ఆరబెట్టిన దృశ్యాలే కనిపిస్తాయి. కొందరు వీటిని విక్రయించి ఆర్థికంగా లాభపడుతుంటే, మరికొందరు వంట చేసుకుని తింటున్నారు.

కానీ ఇంత కష్టపడి సేకరించిన ఇప్పపూలకు మార్కెట్‌లో మాత్రం ఆశించినంత డిమాండ్ లేదు. జీసీసీ (గిరిజన సహకార సంస్థ) ఆధ్వర్యంలో గతంలో కిలోకు రూ.20 చొప్పున కొనుగోలు చేశారు. ఈ ఏడాది కిలోకు రూ.30 చొప్పున విక్రయిస్తామని పేర్కొంటున్నారు. ఇంత కష్టపడి సేకరించిన ఇప్పపూలకు ఆశించిన ధర లేక పోవడంపై ఆదివాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

జీసీసీ కొనుగోలు చేయాలి..

సిడాం భీము, భీమన్‌గొంది



ఇప్పపులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఏరేందుకు సమయం పడుతుంది. గతంలో ఇప్పపువ్వ కిలో 30 రూపాయలకు కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం రూ.50కి పెంచాలి. ఇప్పపూలు ఈసారి చాలా తక్కువ కాసాయి. గిరిజన సహకార సంస్థ(జీసీసీ) ద్వారా 50 రూపాయలకు కొనుగోలు చేయాలి. ధర తక్కువగా ఉండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఇప్పపువ్వలు, జీడి గింజలు కేంద్రాలు ఏర్పాటు చేసి కొనాలి.

కిలో రూ.30కి కొనుగోలు చేస్తున్నాం..

తారాచంద్, జీసీసీ మేనేజర్, ఆసిఫాబాద్



జిల్లాలో ఇప్పపూల సేకరణ సీజన్ ప్రారంభమైంది. ప్రస్తుతం కిలో ఇప్పపూలు 30 రూపాయలకు కొనుగోలు చేస్తున్నాం. ప్రభుత్వానికి, ఐటీడీఏ ఉన్నతాధికారులకు రేటు పెంచాలని లేఖ రాశాం. ప్రభుత్వం నుంచి ఆదేశాల రాగానే కొనుగోలు రేటు పెంచుతాం. తేనె కిలో రూ.225కి కొనుగోలు చేస్తున్నాం.



'రాజీవ్ యువ వికాసాని'కి 500 దరఖాస్తులు

అంజద్‌పాషా, ఎంపీడీవో, కెరమెరి



ఆంధ్రజ్యోతి: రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా ఎన్ని దరఖాస్తులు వచ్చాయి?

ఎంపీడీవో: రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించిన నేటి వరకు 500 దరఖాస్తులు వచ్చాయి. దర ఖాస్తులు ఆన్‌లైన్ చేసినప్పటికీ మ్యానువల్‌గా ఎంపీడీవో కార్యాలయంలో అందజేయాలి. ఈ నెల 15 నుంచి 20 వరకు దరఖాస్తులను పరిశీస్తాము.

ఆంధ్రజ్యోతి: మండల వ్యాప్తంగా ఇంటి పన్ను వసూలు ఎలా ఉంది?

ఎంపీడీవో: మండల వ్యాప్తంగా ఇప్పటి వరకు 93 శాతం ఇంటి పన్నులు వసూలు చేశాము. వంద శాతం వసూలుకు కృషి చేస్తున్నాము.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: వాటర్ షెడ్ పథకం ద్వారా ఎలాంటి పనులు చేపడుతున్నారు?

ఎంపీడీవో: వాటర్ షెడ్ పథకం ద్వారా ఇందాపూర్, ఇందాపూర్ గోండ్ గూడ గ్రామాల్లో భూగర్భజలాలు పెంచేందుకు చెక్ డ్యాంలు, నీటి కుంటలు, ఇంకుడు గుంతలు నిర్మిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: ఏఏ గ్రామాల్లో నిర్మిస్తున్నారు?

ఎంపీడీవో: ఇందాపూర్, ఇందాపూర్ గోండ్‌గూడ, పరందోళి, ముక్దంగూడ, నిషాని గ్రామాల్లో వాటర్ షెడ్ పథకాల అమలు అవుతున్నాయి. గ్రామాల్లో పండ్ల తోటల పెంపకం, మొక్కల పెంపకం చేపడుతున్నాం.

ఆంధ్రజ్యోతి: గ్రామపంచాయతీల ద్వారా చలివేంద్రాలు ఏర్పాటు చేశారా?

ఎంపీడీవో: కోటారి, గోయగాం, ధనోర, సుర్దాపూర్, చౌపన్‌గూడ, కెరమెరిలలో చలివేంద్రాలు ఏర్పాటు చేశాం.

- కెరమెరి (ఆంధ్రజ్యోతి)

నకిలీ పత్తి విత్తనాల పట్టివేత



నకిలీ పత్తి విత్తనాలతో పోలీసులు

కాగజ్‌నగర్ టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్‌లోని ఓ ట్రాన్స్‌పోర్ట్‌లో నకిలీ పత్తి విత్తనాలు టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం పట్టుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు కాగజ్‌నగర్‌లోని పలు ట్రాన్స్‌పోర్ట్‌ల్లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. స్థానిక ఓ ట్రాన్స్‌పోర్ట్‌లో అనుమానాస్పదంగా ఉన్న గన్నీ బ్యాగులను పరిశీలించారు. ఓ బ్యాగులో 45 కిలోల పత్తి విత్తనాలు లభ్యం కాగా, విజయవాడ నుంచి బెజ్జూరు మండలంలోని కుశ్నపల్లికి చెందిన రైతు పేరిట వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకొని కాగజ్‌నగర్ టౌన్ పోలీసుస్టేషన్‌లో అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ తెలిపారు. వీటి విలువ రూ. 1.57 లక్షలు ఉంటుందన్నారు. టాస్క్‌ఫోర్స్ ఎస్సై వెంకటేశ్ పాల్గొన్నారు.

రాంజీ గోండ్‌కు ఘన నివాళి

ఆసిఫాబాద్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పట్టణంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో బుధవారం స్వాతంత్ర పోరాట యోధుడు రాంజీగోండ్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షురాలు మాలశ్రీ, శ్రీనివాస్, రాజు, టీకానంద్, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూరు (ఆంధ్రజ్యోతి): రాంజీగోండ్ వర్ధంతి సందర్భంగా బెజ్జూరు మండల కేంద్రంలోని ఆదివాసీ భవనంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు సకారాం, రాజారాం, మోహన్, చిన్నయ్య, సంతోష్, రామన్న, బషరత్‌ఖాన్, సతీష్, నరేందర్‌గౌడ్, జావీద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



బెజ్జూరులో నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

విద్యార్థులకు అసౌకర్యాలు కలగకుండా చూడాలి



తిరుపతిని సన్మానిస్తున్న జిల్లా అధికారులు

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చూడాలని బీసీ సంక్షేమ శాఖ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ జి తిరుపతి సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పలు హాస్టళ్లను ఆకస్మికంగా తనిఖీ చేసి అధికారులకు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందన్నారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారితో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా తిరుపతిని బీసీ సంక్షేమశాఖ అధికారి పురుషోత్తం నాయక్, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు సుధాలక్ష్మి, మోసిన్ అహ్మద్ సన్మానించారు. కార్యక్రమంలో హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

సిర్పూర్(టి), ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో బుధవారం సిర్పూర్(టి) మండల కేంద్రంలోని బస్టాండు ఏరియాలో ప్రత్యేకాధికారి, ఎంపీడీవో సత్యనారాయణ, ఈఓ తిరుపతి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిని దృష్టిలో పెట్టుకుని చలివేంద్రం ఏర్పాటు చేశామని తెలిపారు. చలివేంద్రంను ప్రజలు, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



చలివేంద్రంను ప్రారంభిస్తున్న ఎంపీడీవో

నర్సరీ కార్మికులను కాంట్రాక్ట్ కార్మికులుగా గుర్తించాలి

శ్రీరాంపూర్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): నర్సరీ కార్మికులను కాంట్రాక్ట్ కార్మికులుగా గుర్తించాలని సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, శ్రీరాంపూర్ బ్రాంచ్ అధ్యక్షుడు దొడ్డిపట్ల రవీందర్ డిమాండ్ చేశారు. నర్సరీలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐటీయూకి చెందిన పలువురు నర్సరీ కార్మికులు ఏఐటీయూసీలో చేరారు. సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం నర్సరీ కార్మికులను పట్టించుకోవడం లేదన్నారు. ఈ నేపథ్యంలో తమ యూనియన్ ఆధ్వర్యంలో పలు పోరాటాలు చేసి, వారికి గుర్తింపు తెచ్చామని పేర్కొన్నారు. పీఎఫ్ అమలు చేసేందుకు యాజమాన్యం ఒప్పుకుందని తెలిపారు. అనంతరం 15 మంది నర్సరీ కార్మికులు ఏఐటీయూసీలో చేరారు. కార్యక్రమంలో బ్రాంచ్ ఉపాధ్యక్షులు రాచర్ల చంద్రమోహన్, ఖాతరాజు ప్రభాకర్, కార్యదర్శి బూర వీరేశం, సహాయ కార్యదర్శి సురేంద్ర చారి, నర్సరీ కార్మికుల సంఘం అధ్యక్షురాలు స్వప్న, కార్యదర్శి లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

యువ కార్మికులకు క్రికెట్ పోటీలు

శ్రీరాంపూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సయ్య స్మారక క్రికెట్ పోటీలు ఎస్ఆర్‌పీ 3 గని కార్మికులకు బుధవారం శాంతి స్టేడియంలో జరిగాయి. ముఖ్య అతిథులుగా ఉపప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముష్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా హాజరై మాట్లాడారు. చిన్నతనం నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు.

అనంతరం క్రీడాకారులకు క్రికెట్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జీఎం చర్చల ప్రతినిధి ప్రసాద్‌రెడ్డి, ఏరియా స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ సకినాల నార్సయ్య, పిట్ కార్యదర్శి మురళి చౌదరి, కాంట్రాక్ట్ కార్మిక సంఘం బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, మీడియా ఇన్‌చార్జి రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రక్షణలో సాంకేతికతను భాగస్వామ్యం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడతున్న అధికారి నాగేశ్వర్‌రావు

శ్రీరాంపూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రక్షణలో సాంకేతికతను భాగస్వామ్యం చేసుకోవాలని డైరెక్టర్ ఆఫ్ మైన్స్(రక్షణ) ఎన్ నాగేశ్వర్‌రావు అన్నారు. సీసీసీలోని సింగరేణి గెస్ట్‌హౌస్‌లో నిర్వహించిన రూఫ్ రక్షణ చర్యలపై సమీక్షకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎల్లవేళలా రూఫ్‌లను పర్యవేక్షించాలన్నారు. ఇన్ డ్యూస్ బ్లాస్టింగ్‌లో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, రక్షణ నియమాలను పాటించాలని, సపోర్ట్ ప్లాన్‌ను అమలు చేయాలని సూచించారు.

ప్రమాద రహిత సింగరేణి కోసం శ్రమించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మైన్స్(రక్షణ) కె. ప్రేమ్ కుమార్, కార్పొరేట్ జీఎం(రక్షణ) చింతల శ్రీనివాస్, బెల్లంపల్లి రీజియన్ జీఎం(రక్షణ) రఘుకుమార్, శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి ఏరియాలకు చెందిన జీఎంలు ఎం. శ్రీనివాస్, దేవేందర్, విజయభాస్కర్ రెడ్డి, జీఎం(రెస్క్యూ) శ్రీనివాస్‌రెడ్డి, ఏరియాల రక్షణాధికారులు శ్రీధర్‌రావు, రాయమల్లు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆర్‌కే 6 గని స్వర్ణోత్సవం

శ్రీరాంపూర్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి) : శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్‌కే 6 గని స్వర్ణోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏరియా జీఎం ఎం శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. 50 ఏళ్లపాటు ఆర్‌కే 6 గని ఎంతో మందికి ఉపాధి చూపిందన్నారు. గనికి పలు అవార్డులు, రివార్డులు వచ్చాయని పేర్కొన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ చూపిన ఉద్యోగులకు సన్మానం చేశారు. ప్రతి కార్మికుడికి జ్ఞాపిక, స్వీట్ బాక్స్‌లు అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం సత్యనారాయణ, ఆర్‌కే గ్రూప్ ఏజెంట్ శ్రీధర్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, సంక్షేమాధికారి సురేందర్, పిట్ కార్యదర్శి సంఘం సదానందం, ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి ముష్కె సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.



కార్మికుడిని సన్మానిస్తున్న అధికారులు

సింగరేణి సమాచారం

రూ. 30 లక్షలు పరిహారం అందజేయాలి



జీఎంకు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ దండే విఠల్, డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావు, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి అంజనేయులు గౌడ్

రెబ్బెన ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గోలేటి ఓపెన్ కాస్టులో భూములు కోల్పోతున్న రైతుకు ఎకరానికి 30 లక్షల రూపాయల పరిహారం ఇవ్వాలని ఎమ్మెల్సీ దండే విఠల్ ఆధ్వర్యంలో పలువురు బెల్లంపల్లి ఏరియా జీఎంకు బుధవారం వినతి పత్రం అందజేశారు. వినతిపత్రం అందించిన వారిలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొక్కిరాల విశ్వ ప్రసాద్‌రావు, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి అంజనేయులు గౌడ్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కృష్ణకుమారి, అసెంబ్లీ కన్వీనర్ సొల్లు లక్ష్మి, నాయకులు నవీన్‌గౌడ్, రైతులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కాంట్రాక్టు కార్మికుల పనివేళలు మార్చాలి

శ్రీరాంపూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు కార్మికుల పనివేళలు మార్చాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు డి బ్రహ్మానందం కోరారు. శ్రీరాంపూర్‌లోని అన్ని విభాగాల కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేసవిలో కార్మికుల పనివేళల మార్పు కోరుతూ గత నెల 18న లేఖ రాశామన్నారు. కానీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. 40 డిగ్రీలు, ఆ పైన ఎండ కాస్తున్నందున కార్మికులు అనారోగ్యం బారినపడకుండా ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పనివేళలు మార్చాలన్నారు. ఓఆర్ఎస్, మజ్జిగ ప్యాకెట్లు అదించాలని కోరారు. కార్యక్రమంలో బాపు, రాజయ్య, మల్లయ్య, ఓదెలు, రమేష్, శంకర్, రవి, సారయ్య, నరసమ్మ, సుగుణ, స్వర్ణలత, కోమల, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేయండి.. ప్రాణదాతలుగా నిలవండి

- మందమర్రి ఏరియా జీఎం దేవేందర్

మందమర్రి టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని మందమర్రి ఏరియా జీఎం దేవేందర్ సూచించారు. బుధవారం స్థానిక ఎంవీటీసీలో రక్తదాన శిబిరం నిర్వహించగా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం సామాజిక బాధ్యతతో తలసేమియా వ్యాధిగ్రస్థులకు అండగా నిలిచేందుకు అనేక రక్తదాన శిబిరాలను నిర్వహిస్తోందన్నారు. ఎంవీటీసీలో కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగాల కోసం వృత్తి శిక్షణ కేంద్రానికి వస్తున్న వారు రక్తదాతలుగా నిలుస్తున్నారన్నారని తెలిపారు. ఇప్పటి వరకు ఎంవీటీసీలో 40 రక్తదాన శిబిరాలు నిర్వహించి 2,856 యూనిట్ల రక్తాన్ని మంచిర్యాల రెడ్ క్రాస్ సొసైటీకి అందజేశామన్నారు. రక్తదానం చేయాలని చెప్పిన వెంటనే ఏమి ఆలోచించకుండా కారుణ్య డిపెండెంట్లు రక్తం ఇవ్వడం గొప్ప విషయమని కొనియాడారు. ప్రతీ మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయడం ద్వారా శరీరానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రక్తదానం చేయడం అంటే మరొకరికి ప్రాణదానం చేయడమే అన్నారు. జిల్లాలో తలసేమియా వ్యాధిగ్రస్థులకు సింగరేణి సంస్థ చేయూత అందిస్తోందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని రక్తదాన శిబిరాలు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారికి ప్రశంస పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం విజయ ప్రసాద్, బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, వృత్తి శిక్షణ మేనేజర్ శంకర్, ట్రైనింగ్ అధికారి అశోక్‌కుమార్, హెడ్ ఓవర్‌మెన్ రాజేషం, రఘు, వరణ్, గురుమూర్తి, రమేష్, సొసైటీ మేనేజ్మెంట్ సభ్యులు కాసర్ల శ్రీనివాస్, తలసేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కాసర్ల రంజిత్, తదితరులు పాల్గొన్నారు.



ప్రశంసా పత్రం అందజేస్తున్న జీఎం దేవేందర్, అధికారులు

రేపు రక్తదాన శిబిరం

నెన్నెల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) మహాత్మ జ్యోతారివుపూలే జయంతిని పురస్కరించుకొని శుక్రవారం ఆవడం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని సమతా సైనిక్‌దళ్ రాష్ట్ర నాయకులు దుర్గం సిదార్థ రామ్మూర్తి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంకులో రక్తం కొరతతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పరిసర ప్రాంతాల యువకులు అధిక సంఖ్యలో రక్త దానం చేయాలని కోరారు. రక్తదానం చేసేవారు 9652804108, 9010230837 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నెన్నెల తహసీల్దార్‌గా మహేంద్రనాథ్

నెన్నెల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) నెన్నెల తహసీల్దార్‌గా బి. మహేంద్రనాథ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మంచిర్యాల కలెక్టరేట్ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. కార్యాలయ సిబ్బంది నూతన తహసీల్దార్‌కు స్వాగతం పలికారు. రైతులకు, ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఇన్నాళ్లు ఇక్కడ తహసీల్దార్‌గా పని చేసిన సబ్బ రమేష్ అక్రమ పట్టాలు చేశారనే ఆరోపణలతో సస్పెండ్ అయ్యారు.


బస్సు షెల్టర్ ప్రారంభం

వేమనపల్లి, ఏప్రిల్9 (ఆంధ్రజ్యోతి): వేమనపల్లి మండలంలోని నీల్వాయి, మంగనపల్లి బస్‌స్టాప్‌ల వద్ద పునర్నిర్మించిన బస్సు షెల్టర్‌లను బుధవారం జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు ప్రారంభించారు. గతంలో ప్రభుత్వం నిర్మించిన ఈ బస్సు షెల్టర్‌లు శిథిలావస్థకు చేరడంతో పోలీసు అధికారులు వీటికి మరమ్మతులు చేయించి ఈ షెల్టర్‌లను ప్రారంభించారు. ప్రయాణికుల సౌకర్యం కోసం చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. నీల్వాయి ఎస్ఐ శ్యాంపటేల్, మాజీ జడ్పీటీసీ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

లబ్ధిదారులకు నాణ్యమైన బియ్యం అందించాలి

కాసిపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : రేషన్ షాపుల ద్వారా లబ్ధిదారులకు అందిస్తున్న సన్నబియ్యాన్ని సక్రమంగా అందిస్తూ డీలర్లు సమయ పాలన పాటించాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకురాలు అమురాజుల శ్రీదేవి అన్నారు. బుధవారం మండలం లోని దేవాపూర్‌లోని రేషన్ షాపును పరిశీలించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సన్నబియ్యాన్ని సకాలంలో లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సూరం సంపత్, ప్రధాన కార్యదర్శి బాలరాజు, నాయకులు దేవునూరి సంతోష్, పెద్దపల్లి శంకర్, వనిత, చారులత, విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

ఇంటర్ కళాశాల లేక ఇక్కట్లు



కళాశాల ఏర్పాటు కోసం తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న విద్యార్థులు (ఫైల్)

- అమలుకు నోచుకోని హామీ
- ఉన్నత. విద్యకు దూరమవుతున్న పేద విద్యార్థులు
- ఇంటర్ కళాశాల ఏర్పాటు చేయాలని వేడుకోలు

భీమిని, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): భీమిని మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తాం అన్న హామీ మాటలకే పరిమితం అయింది. మండలంలో అనేక మంది పేద, మధ్యతరగతి జీవనం కొనసాగించే ప్రజలు ఉన్నారు. కూలీ పనులు చేసుకుంటూ పిల్లలను చదివిస్తున్నారు. కొంత మంది విద్యార్థులు పదో తరగతి పూర్తయిన తర్వాత ప్రైవేటు కళాశాలలకు పంపించాలంటేనే డబ్బులు లేక మధ్యలోనే చదువు మాన్పిస్తున్నారు. తల్లిదండ్రులు రెక్కల కష్టంపై ఆయా గ్రామలలో పదవ తరగతి వరకు చదువులు వెళ్లదీసిన విద్యార్థులు అంతటితో చదువులను ఆపేస్తున్నారు.

చదవాలనే కోరిక ఉన్నా.... ఉంటర్ కళాశాలలు అందుబాటులో లేక.. పట్టణా లలో చదివే స్థోమత లేక చదువులకు స్వస్తి చెబుతు న్నారు. మండలంలో కళాశాల ఏర్పాటు చేస్తామని పదేళ్లుగా పాలకులు హామీలు ఇస్తున్నా అమలుకు నోచుకోవడం లేదు. దీంతో మండలంలో విద్యార్థులు ఉన్నత చదువుల కోసం బెల్లంపల్లి, మంచి ర్యాల, కాగజ్‌నగర్, తాండూర్ తదితర పట్టణాలకు తరలి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. కొంతమంది విద్యార్థులు, బాలికలు దూర ప్రాంతాలకు వెళ్లలేక చదువులను మధ్యలోనే ఆపేస్తున్నారు. ఉత్తీర్ణతలో ఎక్కువ మంది బాలికలే అవ్వడంతో బాలికలకు కళాశాల ఏర్పాటు చేసినట్లయితే ఉన్నత చదువులకు చదవడం సులువుగా ఉంటుంది.

ఇదీ విద్యార్థుల పరిస్థితి..

భీమిని మండలంలోని నాలుగు ఉన్నత పాఠశాలల్లో 2017-18 సంవత్సరం 120 మంది విద్యార్థులు, ఉమ్మడి కన్నెపల్లి, భీమినిలో అప్పుడు ఎనిమిది పాఠశాలలకు గానూ 2018-19లో 326 మంది, 2022-23వ సంవత్సరంలో 111 మంది, 2023-24లో 94 మంది పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించారు. మండలంలో ఇంటర్ కళాశాల లేకపోవడంతో వీరంతా బెల్లంపల్లి, తాండూర్, మంచిర్యాల తదితర పట్టణాలకు వెళ్లాల్సిన పరిస్థితి. మరికొంత మంది చదువులకు స్వస్తిచెబుతున్నారు.

భీమిని మండలంతో పాటు పక్కన ఉన్న కన్నెపల్లి మండలంలో కూడా ఇంటర్ కళాశాల లేదు. దీంతో భీమిని, కన్నెపల్లి మండలాల్లో ఇంటర్ కళాశాలలు లేకపోవ డంతో పతో తరగతి కాగానే సంగం మంది చదువులకు స్వస్తి చెబుతున్నారు. ఆర్థిక పరిస్థితులు కొంత మెరుగ్గా ఉన్నవారు మాత్రమే ఉన్నత చదువులకు ఇతర ప్రాంతాలలో తమ పిల్లలను ఇంటర్ చదివిస్తున్నారు. చదువుకు(కా)నే స్థోమత లేని నిరుపేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమై ఇంటి పనులకు పరిమితమవుతున్నారు. వీరిలో అధిక శాతం బాలికలే ఉండటం గమనార్హం. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు ఆయా మండల కేంద్రాలలో ఇంటర్ కళాశాలలు ఏర్పాటు చేస్తే నిరుపేద విద్యార్థులు ఉన్నత చదువులు చదివే అవకాశముంటుందని విద్యార్థులు వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

కళాశాల ఏర్పాటు చేస్తే ఇబ్బందులు తొలిగిపోతాయి... గోప రాజేశ్వరి, చిన్నగుడిపేట



ఇంటర్ చదువులకు బెల్లంపల్లి తదితర పట్టణాలకు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంటోంది. మండలంలో కళాశాల ఏర్పాటు చేస్తే చదువుకోవడం సుల భమవుతుంది. దూరం వెళ్లి చదువాలంటే మాలాంటి గ్రామీణ ప్రాంత విద్యార్థులకు భారమే. ప్రతీ రోజు ఉదయం బెల్లంపల్లికు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నాము. బస్సులు సమయానికి రావడం లేదు. ప్రభుత్వం స్పందించి బస్ సౌకర్యంతో పాటు ఇంటర్ కళాశాలను ఏర్పాటు చేయాలి.

అమ్మాయిలు ఉన్నత చదువుకు దూరం అయ్యే అవకాశం ఉంది: మోర్ల అంజలి, భీమిని



గ్రామీణ ప్రాతాల్లో ప్రభుత్వ కళాశాలలు లేకపోవడంతో దూర ప్రాంతాలకు వెళ్లి చదవడం కష్టమవుతుంది. కష్టపడి చదువుదామనుకున్నా తల్లిదండ్రులకు ఇష్టంలేకపోవడంతో పేద విద్యార్థులు చదువులకు దూరమవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రభుత్వ కళాశాలు ఏర్పాటు చేయాలి. మండలంలో కళాశాల లేకపోవడంతో బెల్లంపల్లి, మంచిర్యాల, మంద మర్రి పట్టణాలకు తరలివెళ్లాల్సి వస్తుంది. మండలంలో కళాశాల ఏర్పాటు చేసినట్లయితే విద్యార్థులకు ఇబ్బందులు తగ్గుతాయి. పదవ తరగతి పూర్తి అయితే బెల్లంపల్లి తదితర పట్టణాలకు వెళ్లి చదువు కొనాల్సిన పరిస్థితులు ఉన్నాయి. భీమిని ఏర్పాటు చేస్తే ఇబ్బందులు తొలుగుతాయి.

నేరాల నియంత్రణే ప్రధాన లక్ష్యం

మంచిర్యాలక్రైం, ఏప్రిల్9 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణ ప్రజల ఆస్తుల రక్షణే ధ్యేయంగా పని చేయాలని డీసీపీ భాస్కర్ అన్నారు. బుధవారం మంచిర్యాల పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. ఈసందర్భంగా నేరాలకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాలు, వాటి నియంత్రణ గురించి తీసుకోవాల్సిన చర్యలు సిబ్బందితో కలిసి చర్చించారు. బ్లూకోర్ట్ సిబ్బంది పట్టణంలో సంచరించినప్పుడు తాళం వేసిన ఇండ్లను గురించి వాటి వివరాలు సేకరించి పోలీసు స్టేషన్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు. ప్రజలు బయటకు వెళ్లినప్పుడు పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనుమానిత వ్యక్తులు ఎవరైన ఉంటే వారి వివరాలు తెలుసుకోవాలన్నారు. అనంతరం నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్, ఎస్ హెచ్‌వో ప్రమోద్‌రావు, ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.



పోలీసు అధికారులు, బ్లూకోట్స్ సిబ్బందితో మాట్లాడుతున్న డీసీపీ భాస్కర్

పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గించాలి

పలు ప్రాంతాల్లో వెల్లువెత్తిన నిరసనలు



బెల్లంపల్లిలో రాస్తారోకో చేస్తున్న సీపీఐ నాయకులు

బెల్లంపల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ బుధవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద సీపీఐ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశ న్నంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద మధ్య తరగతి వర్గాలపై సిలిండర్ ధర రూ.50 పెంచి భారం పెంచడం సరైంది కాదన్నారు. పెంచిన ధరలు వెంటనే తగ్గించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యులు మిట్టపల్లి వెంకటస్వామి, మండల కార్యదర్శి బొంతల లక్ష్మీనారాయణ, నాయకులు రాజేశ్, గుండా చంద్రమాణిక్యం, భానేష్, రత్నం రాజం, సీపీఐ పట్టణ కార్యదర్శి రాజమౌళి, గుండ సరోజ, బొల్లం సోని పాల్గొన్నారు.

జన్నారం : పెంచిన వంట గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని కోరుతూ బుధవారం సీపీఐఎం నాయకులు జన్నారంలోని రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. మండల ప్రధాన కార్యదర్శి కనికరపు అశోక్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందన్నారు. పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలన్నారు. నాయకులు లింగన్న, బుచ్చయ్య, జయ, లక్ష్మణ్, నారాయణ పాల్గొన్నారు.

కాసిపేట : అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధరలు తగ్గినప్పటికీ కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధరలను పెంచి సామాన్యులపై భారం మోపిందని మాజీ జడ్పీటీసీ రౌతు సత్తయ్య ఒక ప్రకటనలో తెలిపారు. వెంటనే గ్యాస్‌ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

నెన్నెల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామి పనులకు వెల్తున్న కూలీలు వడదెబ్బకు గురికాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మణ్ సూచించారు. రోజురోజుకు ఎండలు పెరుగుతున్న దృష్ట్య అధికారులు బుధవారం బొప్పారం శివారు పని స్థలాలకు వెళ్లి కూలీలకు అవగాహన కల్పించారు. వేకువ జామున పనికి వెళ్లి ఉదయం 11 గంటల లోపు ముగించుకొని ఇంటికి తిరిగి రావాలన్నారు. కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఏపీవో నరేష్, పంచాయతి కార్యదర్శి సురేష్ ఉన్నారు.

పూలే జయంతిని ఘనంగా నిర్వహించాలి

కన్నెపల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 11న మహాత్మాజ్యోతిరావుపూలే జయంతిని ఘనంగా నిర్వహించాలని మాలీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ బుధవారంఒక ప్రకటనలో కోరారు. మాలీ సంఘం ఆధ్వర్యంలో కొన్నేండ్లుగా జయంతి, వర్ధంతిలను నిర్వ హించామని, 2008 నుంచి ప్రభుత్వం అధికారంగా నిర్వహిస్తుందని తెలిపారు. మాలీ కులస్తులతో పాటు బీసీ సంఘం నాయకులు వేడుకల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు



పొన్నారంలో మాట్లాడుతున్న ఎంపీ వంశీకృష్ణ, ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

మందమర్రిరూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి నిరుపేదకు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. బుధవారం పొన్నారంలో గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులకు భూమి పూజ చేసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామన్నారు. 198 మందికి ఇండ్లు మంజూరయ్యాయన్నారు. అనంతరం చిర్రకుంటలో జై బాపు, జై భీం, జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహించారు. ప్రజల చేత ఎమ్మెల్యే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గందె రాంచందర్, మాజీ సర్పంచు ఒడ్నాల కొమురయ్య, సీనియర్ నాయకులు సొత్కు సుదర్శన్, బండి సదానందం యాదవ్, నీలయ్య పాల్గొన్నారు.

భీమిని : మండలంలోని పైలట్ ప్రాజెక్టు కింద మల్లీడి గ్రామంలో బుధవారం కాంగ్రెస్ నాయకులు, అధికారులు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గాదం లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇందిరమ్మ ఇళ్లు అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇళ్లు వచ్చేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గంగమోహన్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మాధవరపు నర్సింగరావు, కన్నెపల్లి మండల అధ్యక్షుడు పప్పుల రామాంజనే యులు, యూత్ కాంగ్రెస్ బెల్లంపల్లి ఉపాధ్యక్షుడు రోహిత్, మాజీ ఎంపీటీసీ ప్రభాకర్, శ్రీనివాస్, శ్రీనివాస్‌గౌడ్, దశరథ్, నాయకులు పాల్గొన్నారు.

వేమనపల్లి : మండలంలోని కల్లెంపల్లి గ్రా మంలో బుధవారం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను ఎంపీడీవో కుమారస్వామి ముగ్గుపోసి ప్రారంభించారు. కల్లెంపల్లి గ్రామానికి మొదటి విడతలో 19 ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని తెలిపారు. మాజీ జడ్పీటీసీ సంతోష్‌కుమార్, ఎంపీవో శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సాబీర్ ఆలీ, ముల్కల సత్యనారాయణ, ముజ్జు, రాజన్న పాల్గొన్నారు.

కన్నెపల్లి : మండలంలోని టేకులపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లనిర్మాణ పనులను బుధవారం మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మాధవరపు నర్సింగరావు, మండల అధ్యక్షుడు పప్పుల రామాంజనేయ ప్రారంభించారు. ఎంపీడీవో శంకర్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ఏల్పుల రోహిత్, కాంగ్రెస్ నాయకులు రంగారావు, బీరయ్య, సురేష్, రాజారావు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని అనుసరించాల్సిన బాధ్యత అందరిది

చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

రామకృష్ణాపూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం దేశ ప్రజలకు గొప్ప వరమని రాజ్యాంగ ఆవశ్యకతను తెలుసుకోవాల్సిన బా ధ్యత అందరిపైన ఉందని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. బుధవారం రామకృష్ణాపూర్‌లో జైబాపు జైభీం జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించిన అనంతరం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, టీపీసీ ప్రధాన కార్యదర్శి రఘునాథ్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి వొడ్నాల శ్రీను, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ జంగం కళ, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

మంచిర్యాల క్రైం: బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చే కుట్రలు చేస్తుందని మంచిర్యాల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పూదరి తిరుపతి అన్నారు. మంచిర్యాల పట్టణం 4వ వార్డులో జై బాపు, జై భీం, జై సంవిధాన్ పాదయాత్ర కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం కాంగ్రెస్ నాయకులచే ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు తూముల నరేశ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ సల్ల మహేశ్, రామగిరి పాల్గొన్నారు.

భీమారం : మండలంలోని అర్హులైన వారందరికి రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ ఫలాలను అందించేందుకు కృషి చేస్తామని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకట స్వామి పేర్కొన్నారు. బుధవారం రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలో భాగంగా భీమారం మండలంలో ఆవడం క్రాస్‌రోడ్డు నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు కార్యకర్తలు, నాయకులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. రాజ్యాంగాన్ని రక్షించాలని, జై భీమ్ జై సంవిధాన్ పాదయాత్ర నిర్వహిస్తుమన్నారు. కాంగ్రెస్ నాయకులు సత్యనారాయ ణరెడ్డి, పోడేటి రవి, లక్ష్మణ్, బాపు, రమేష్, మోహన్‌రెడ్డి, భాస్కర్ రెడ్డి, శ్రీనివాస్, పున్నంచంద్, తిరుపతి పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: రాజ్యాంగ పరిరక్షణ కోసం ఈనెల 2వ తారీకున కాంగ్రెస్ పార్టీ చేపట్టిన జైబాపు, జై భీం, జైసంవిధాన్ అవగాహన ర్యాలీలు ముగిసాయి, బుధవారం చివరిరోజు మండలంలోని కొత్తూర్, ఎల్లారం గ్రామాలలో నాయకులు పెద్ద ఎత్తున అవగాహన ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పింగిళి రమేష్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గుండ బుచ్చన్న, సీనియర్ నాయకులు పూర్ణచంద్‌రావు, నాగభూషణం, అశోక్ కుమార్, శ్రీనివాస్, ఆరీఫ్, రమేష్ పాల్గొన్నారు.

అందని.. అత్యవసరం

(3వ పేజీ తరువాయి)

ఆసుపత్రిలో అవసరమైన అత్యవసర విభాగాల్లో మెడికల్ ఆఫీసర్లు లేరు. జిల్లా ఆసుపత్రిలో 11 మంది క్యాజువాలిటీ వైద్యులు ఉండాల్సి ఉండగా, కేవలం ముగ్గురితోనే కాలం వెళ్లదీస్తున్నారు. అందులోనూ ఇద్దరు వైద్యులు సెలవులపై వెళ్లగా ప్రస్తుతం ఒక్క మెడికల్ ఆఫీసర్ పైనే ఆసుపత్రి ఆధారపడి ఉంది. క్యాజువాలిటీ విభాగంలో నిత్యం సగటున 20 వరకు అత్యవసర కేసులు వస్తున్నాయి. క్యాజువాలిటీ విభాగం 24 గంటలపాటు రోగులకు అందుబాటులో ఉండాలి. మూడు షిఫ్టుల్లో ఒక్కొక్కరు చొప్పున మెడికల్ ఆఫీసర్లు విధుల్లో ఉండాలి. అయితే ఒక్కరే విధుల్లో ఉండటం వల్ల అత్యవసర విభాగాల్లో రోగులకు సేవలు అందడం లేదు. ఈ పరిస్థితి నుంచి బయట పడేందుకు స్థానిక మెడికల్ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న పలువురు వైద్య నిపుణులకు అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నారు. మెడికల్ కళాశాల వైద్య నిపుణులు అదనపు బాధ్యతలు నిర్వహించేందుకు నిరాకరిస్తున్నారు.

ఖాళీలు భర్తీ చేసేందుకు కృషి చేస్తాం...

జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరీష్‌చంద్ర రెడ్డి



చీఫ్ మెడికల్ ఆఫీసర్ల నియామకం కోసం పలుమార్లు నోటిఫికేషన్లు జారీ చేసినప్పటికీ ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో కళాశాల వైద్య నిపుణులకు చీఫ్ మెడికల్ ఆఫీసర్లుగా అదనపు బాధ్యతలు అప్పగించాల్సి వస్తోంది. కనీసం పది మంది చీఫ్ మెడికల్ ఆఫీసర్లను నియమించాల్సి ఉంది. అత్యవసర విభాగాల్లో ఉన్న ఖాళీలను త్వరితగతిన భర్తీ చేయడం ద్వారా మెరుగైన చికిత్స అందించేందుకు కృషి చేస్తాం.

నాణ్యమైన వరిధాన్యం కొనుగోలు చేయాలి



మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్

చెన్నూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : రైతుల వద్ద నుంచి నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ అన్నారు. బుధవారం చెన్నూరులోని షాదిఖానాలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, డీఆర్‌డీవో కిషన్, మండల తహసీల్దార్ మల్లికార్జున్‌తో కలిసి కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సన్నబియ్యం పండించిన రైతులకు మద్దతు ధరతో పాటు క్వింటాళుకు రూ. 500 చొప్పున బోనస్ అందిస్తామన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, నీడ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉంచాల న్నారు. ఈకార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ మేనేజర్ శ్రీకళ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

'బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి'

దండేపల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): బీజేపీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు పార్టీ నాయకులు ఓ సైనికుల పని చేయాలని జిల్లా ఉపాధ్యక్షుడు ఎనగందుల కృష్ణమూర్తి అన్నారు. దండేపల్లిలో బీజేపీ కార్యాలయంలో బూత్‌స్థాయి కార్యకర్తలతో బుధవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ప్రతి గ్రామానికి పార్టీ బూత్‌స్థాయి ఇన్‌చార్జిలను నియమించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గోపతి రాజయ్య, మండల ఇన్‌చార్జి ప్రభాకర్, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, ఎంబడి సురేందర్, ఉపాధ్యక్షులు కర్నాల కిషన్ పాల్గొన్నారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

గర్మిళ్ల, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించనున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని పార్టీ రాష్ట్ర నాయకులు విజిత్ కుమార్ పిలుపునిచ్చారు. పార్టీ ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకొని ఈ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభను బీఆర్ఎస్ పార్టీ అభిమానులు, నాయకులు కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు.

ఆలయంలో నేడు ప్రత్యేక పూజలు

దండేపల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మ్యాదరిపేటలో శ్రీలక్ష్మినారాయణస్వామి శ్రీఅన్నపూర్ణ కాశీవిశ్వేశ్వర, శివపంచాయాతన దేవాలయ 8వ వార్షికోత్సరం పురస్కరించుకుని దేవాలయంలో గురువారం ఉదయం నుంచే ప్రత్యేక పూజలు, నారాయణ హోమాలు, అభిషేక పూజలను నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు శ్రీ లింగాల ప్రకాష్‌రావు-శ్రీమతి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆలయంలో కాశీ విశ్వేశ్వర దక్షణముఖ అంజేయయస్వామి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాటు చేశామన్నారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.


లబ్ధిదారుడి ఇంట్లో అధికారుల భోజనం

కోటపల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మల్లంపేట గ్రామంలో బుధవారం బత్తుల చిన్నన్న అనే వ్యవసాయ కూలీ, సన్నబియ్యం లబ్దిదారుని ఇంట్లో మండల తహసీల్దార్ రాఘవేందర్‌రావు, ఎంపీవో అక్తర్ మొహియొద్దీన్, డిప్యూటి తహసీల్దార్ నవీన్ కుమార్‌లతో పాటు పలువురు సిబ్బంది భోజనం చేశారు. సన్నబియ్యం పథకంలో భాగంగా బియ్యం ఏ విధంగా ఉన్నాయనే దానిపై పరిశీలించిన అధికారులు లబ్దిదారుని ఇంట్లో భోజనం చేసి బియ్యం పంపిణీ సక్రమంగా జరుగుతుందా లేదా అని తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గిర్దావర్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి శ్రీవిద్య తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ల విడుదల

జన్నారం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 12న జన్నారం మండల కేంద్రంలో నిర్వహించనున్న మహనీయుల జయంతి ఉత్సవాల పోస్టర్లను బుధవారం జన్నారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జీ భుక్య జాన్సన్ నాయక్ విడుదల చేశారు. మహనీయుల జయంతిలను ఎస్సీటీ చైర్మన్ రాష్ట్ర అధ్యక్షుడు సాయిని ప్రసాద్ నేత ఆధ్వర్యంలో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు గంగాధర్, నర్సగౌడ్, సంతోష్, ప్రభుదాస్, వినోద్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం



చిన్నారులకు అక్షరాభ్యాసం చేపిస్తున్న సీడీపీవో రేష్మా

లక్సెట్టిపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపూర్ గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం సీడీపీవో రేష్మా చేతుల మీదుగా చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం చేపట్టారు. సీడీపీవో మాట్లాడుతూ పోషకపక్షం కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు అక్షరాభ్యాసం చేపించామన్నారు. చిన్నారులకు మంచి పౌష్టికాహారం అందజేయాలని పిల్లల ఎదుగుదలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సూపర్‌వైజర్ వాణి, ఉమెన్‌హబ్ జెండర్ స్పెషలిస్టు లిప్పిక, పంచాయితీ సెక్రటరీ దుర్గాదేవి, ఏఎన్ఎం రమ, అంగన్‌వాడీ టీచర్లు వనిత, నర్సమ్మ, తిరుమల, గంగా, సునీత, నాగలక్ష్మి, ఆశాకార్యకర్త రంగీత పాల్గొన్నారు.



చలివేంద్రం ప్రారంభం

వాంకిడి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పోలీసులు మీ కోసం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని బస్టాండు ప్రాంతంలో ఏఎస్ఐ పోశెట్టి చలివేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. రోజురోజుకు పెరుగుతున్న ఎండల తీవ్రతకు మండల కేంద్రానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు పోలీసులు మీ కోసం కార్యక్రమంలో భాగంగా చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన విద్యను అందించండి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా

- ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా

ఆసిఫాబాద్‌రూరల్/రెబ్బెన ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా సూచించారు. ఆసిఫాబాద్ ఆశ్రమ పాఠశాల(బాలుర) గోలేటి, ఆశ్ర మ పాఠశాల(బాలుర)ను బుధ వారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సంద ర్భంగా వివిధ సమస్యలను విద్యార్థుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతీ రోజు మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహా రం అందిం చాలని సూచించారు. సబ్జెక్టుల వారీగా అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చే యాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. దోమల వల్ల వ్యాపించే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తగా ఉండేలా చూడాలన్నారు. ప్రతి రోజు వంట గది, స్టోర్ రూం, తాగునీరు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆశ్రమ పాఠశాల(బాలుర) గోలేటిలో తాగునీటి ప్లాంట్లు పనిచేయక పోవ టం, మెనూ పాటించకపోవటంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం విద్యా ర్థులకు అల్పాహారంలో స్నాక్స్ మజ్జిగ అందించలేదని విద్యార్థులు ఐటీడీఏ పీవోకు ఫిర్యాదు చేశారు. దీంతో వార్డెన్ రవీందర్‌కు షోకాజ్ నోటీసును అందజే శారు. ఎలాంటి అనుమతులు లేకుండా విధు లకు గైర్హాజరైన రాజేశ్వర్ అనే ఉపాధ్యాయుడికి షోకాజ్ నోటీ సు ఇచ్చారు. ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

దహెగాం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): దహెగాం మండలంలోని లగ్గాం- పెంచికల పేట క్రాస్ రోడ్డు వద్ద బుధవారం ఎస్సై రాజు వాహనాల తనిఖీ చేపట్టారు. వాహన పత్రాలు లేని వారికి జరిమానా విధించారు. డ్రైవర్లు అన్ని పత్రాలు కలిగి ఉండాలని, యూనిఫాం ధరించాలని సూచించారు. మ ద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు.



ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న ఎస్సై రాజు



సాగు భారం

- జిల్లాలో మొదలైన వేసవి దుక్కులు
- రోజురోజుకు రెట్టింపు అవుతున్న యంత్ర సామగ్రి ధరలు
- పెట్టుబడి వ్యయంతో రైతుల ఆందోళన

ఆసిఫాబాద్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయమే ప్రధాన జీవనధారమైన జిల్లాలో పంటలపై రోజురోజుకు సాగు భారం ఎక్కువ అవుతున్నది. యేటా పెరిగిపోతున్న పెట్రోల్, డీ జిల్ ధరలతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. జిల్లాలో వానాకాలం పంటల సాగుకు చేలను సిద్ధం చేసే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. ప్రస్తుతం వేసవి దుక్కుల పనులు జోరుగా సాగుతున్నాయి. పెట్రోల్,డిజిల్ ధరలు విపరితంగా పెరిగిపో వడంతో బక్క రైతుపై సాగు భారం మరింత పడుతోంది. కాడెద్దులు కనుమరుగై పోవడంతో ఆధునిక సాగు పద్ధతులతో పంటల సాగు చేపడుతున్నారు. గతంలో కాడెద్దులతోనే రైతులు సాగు పనులు చేసేవారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితులు ఎక్కడ కనిపించడం లేదు. దీంతో అందుబాటులో ఉన్న ట్రాక్టర్ యంత్రాల సహాయంతోనే సాగు పనులు చేపడుతున్నారు. ఒక్కో గ్రామంలో ఐదు నుంచి పది ట్రాక్టర్లు కనిపిస్తున్నాయి. దీంతో ఇంధన డిమాండ్ భారీగా పెరుగుతోంది. పెట్రోల్, డీజిల్ ధరలు కొంత కాలంగా 100 రూపాయలు దాటి కనిపిస్తున్నాయి.పెరిగి పోయిన ఇంధనదరలతో పంటల సాగుచేయడం కష్టమవుతోం దన్న అభిప్రాయలు వక్తమవుతున్నాయి. ఏటేటా పెట్టుబడి ఖర్చులు పెరిగిపోతున్నా.. దానికి అనుగుణంగా మద్దతు ధరలు పెరుగకపోవడంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు.

● మండుతున్న ఇంధన రేట్లు...

జిల్లాలో ప్రస్తుతం లీటర్ పెట్రోల్ ధర రూ 108.82 ఉండగా, లీటర్ డీజిల్ ధర రూ. 97.09 లుగా ఉంది. ప్రస్తుతం వేసవి దుక్కుల పనులు ఊపందుకోవడంతో గ్రామాల్లో ట్రాక్టర్లు కూడా బిజీగా మారిపోయాయి. ఇక పెట్రోల్ బంకుల్లో డీజిల్, పెట్రోల్ అమ్మకాలు కూడా ఎక్కువగానే కనిపిసున్నాయి. సీజన్ మొదలైన ఇంధన ధరలు తగ్గుముఖం పట్టకపోవడంతో రైతులకు మరింత భారంగా మారింది. జిల్లాలో రైతులు వేసవి దుక్కులు చేపడుతూ పంట చేలను చదును చేసుకుంటున్నారు. ఎండలు ముదిరి పోవడం, ఈ సమయంలోనే వేసవి దుక్కులు చేపడితే మంచి ప్రయోజనం ఉంటుందని రైతులు అభిప్రాయ పడుతున్నారు.

● యేటా రూ.కోట్ల భారం...

ఇందన ధరలు పెరిగిపోవడంతో జిల్లా రైతాంగంపై యేటా కోట్ల రూపాయల భారం పడుతోంది. దీంతో పంటలు సాగు చేయడం కష్ట సాధ్యమేనన్న అభిప్రాయలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో మొత్తం 1,19,978 మంది రైతులు ఉండగా 4,50,000 ఎకరాల్లో ప్రతి యేటా వివిధ పంటలను సాగు చేస్తున్నారు. దుక్కి దున్నినప్పటి నుంచి పంట చేతికొచ్చే వరకు పెట్టుబడి ఖర్చులు భారీగా పెరిగి పోతున్నాయి. నాలుగైదు సంవత్సరల క్రితం వరకు ఎకరానికి రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు ఖర్చయ్యేది. కానీ ప్రస్తుతం 20వేల రూపాయల నుంచి 30వేల రూపాయల వరకు పెట్టుబడి వ్యయం అవుతుందని రైతులు వాపోతున్నారు. దీనికి తోడు కూలీల కొరతతో యంత్రాల విని యోగం విపరీతంగా పెరిగిపోతోందంటున్నారు. దీంతో యేటా కోట్ల రూపాయల భారం రైతులపై పడుతున్నది.

● పెరుగుతున్న అద్దె ధరలు...

ఇందన ధరలకు అనుగుణంగానే ట్రాక్టర్ యజమానులు అద్దె ధరలను పెంచేయడంతో అన్నదాతలపై అదనంగా భారం పడుతోంది. యేటా గంటకు రూ.100 నుంచి రూ.200 వరకు అద్దెలను పెంచేస్తున్నారు. డీజిల్ ధరలు పెరగడంతో తమకేమి గిట్టుబాటు కావడం లేదని ట్రాక్టర్ యజమానులు పేర్కొంటున్నారు. తక్కువ సమయంలో ఎక్కువ పనులు చేసే విధంగా రైతులు సాగు పనుల్లో యంత్రాలను ఎక్కువగా వినియోగిస్తున్నారు. ప్రతీ పనిని యంత్రాల సహాయంతోనే చేపడుతున్నారు. ప్రస్తుతం యంత్రాలతో వేసవి దుక్కులు దున్నడం, పంట చేలను చదును చేయడం, చెరువులు, కుంటల నుంచి నల్ల మట్టి, సేంద్రియ ఎరువులను తరలించడం, పత్తి కర్రలను తొలగించడం లాంటి పనులు ముమ్మరంగా కొనసాగు తున్నాయి. అయితే ఇంధన ధరలు పెరిగాయన్న సాకుతో ట్రాక్టర్ యజమానులు అద్దెలను అమాంతంగా పెంచేస్తున్నారు. గత్యం తరం లేక రైతులు పనులు చేయించుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి.

సాగు ధరలు పెరిగాయి

- పుల్గం పోశం, రైతు, ఆసిఫాబాద్



పంటల సాగు పనుల ధరలు రోజురోజుకు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇందన ధరలతో పాటు ఎరువులు, విత్తనాలు ధరలు పెరగడంతో పెట్టుబడి వ్యయం పెరుగుతోంది. నాలుగైదు సంవత్సరల క్రితం వరకు ఎకరానికి 10వేల నుంచి 15 వేల రూపాయల వరకు ఖర్చయ్యేది. కానీ ప్రస్తుతం 20వేల రూపాయల నుంచి 30వేల రూపాయల వరకు పెట్టుబడి వ్యయం అవుతున్నది.

ఎస్‌ఏ-2 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఏసీఎంవో ఉద్దవ్

బెజ్జూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఎస్‌ఏ-2 పరీక్షలను పకడ్బందీగా నిర్వహిం చాలని ఏసీఎంవో ఉద్దవ్ అన్నారు. బుధవారం మండలంలోని సలుగుపల్లి ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో మొగడ్‌దగడ్, సోమిని, సలుగుపల్లి స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా లోని ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలల్లో ఎస్‌ఏ-2 పరీక్షలకు సిద్ధం చేయాలని సూచించారు. ఇందు కోసం విద్యార్థుల పరీక్షల సమయం లో ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నా రు. ఒంటి పూట బడుల నేపథ్యంలో విద్యా ర్థులు పాఠశాల నుంచి బయటికి వెళ్లకుం డా జాగ్రత్త పడాలన్నారు. ఆయన వెంట ఏ టీడీవో ఖమర్, హెచ్‌ఎం ప్రసాద్ ఉన్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే





సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఈవీఎం స్ట్రాంగ్ రూం వద్ద కలెక్టర్, అధికారులు

ఆసిఫాబాద్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అధికారులకు సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు, ఆర్డీవో లోకేశ్వర్‌రావులతో కలిసి పరీక్షల నిర్వహణపై జిల్లా విద్య, వైద్య, ఆరోగ్య, రవాణా, ఆర్టీసీ, విద్యుత్, గ్రామీణనీటి సరఫరా, తపాల శాఖాధికారులు, మున్సిపల్ కమిషనర్లతో సమీక్షా సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగా ణ ఓపెన్ స్కూల్ సొసైటీ ప్రకటించిన కార్యాచరణ ప్రకారం ఈ నెల 20 నుంచి 26 వరకు జిల్లాలో జరుగ నున్న పది, ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ప్రతీ రోజు ఉదయం, మధ్యాహ్నం రెండు పేపర్లు ఉంటా యన్నారు. పదోతరగతి పరీక్షల కోసం ఆసిఫాబాద్ మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, కాగజ్‌నగర్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో, ఓపెన్ ఇంటర్మీడియట్ పరీక్షల కోసం ఆసిఫాబాద్‌లోని జక్కాపూర్ జిల్లా పరిషత్, కాగజ్‌నగర్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, ఫ్యాన్లు, ఫర్నీచర్ ఉండేలా చర్యలు తీసుకోవాలని, ప్రతీ పరీక్షా కేంద్రంలో వైద్య సిబ్బందిని నియమించి అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకె ట్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఆర్టీసీ శాఖ అధికారులు సమయానుకూలంగా బస్సులు నడిపించా లని సూచించారు. సమావేశంలో పరీక్షల కమిషనర్ ఉదయబాబు, డీఎంహెచ్‌వో సీతా రాం, ఆర్టీసీ డీఎం రాంచందర్, విద్యుత్ శాఖాధికారి శేషరావు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

ఈవీఎంల భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు

జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదాంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల భద్రత కోసం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే తెలిపారు. బుధవారం నెల వారీ తనిఖీల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదాం, రక్షణ చర్యలను పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈవీఎం గోదాం వద్ద పటిష్టమైన బందో బస్తు ఏర్పాటు చేసి సీసీ కెమెరాల ద్వారా 24 గంటల పాటు పర్యవేక్షిస్తు న్నామని తెలిపారు. బందోబస్తు విధులు నిర్వహిస్తున్న సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశిం చారు. ఆయన వెంట ఎన్నికల పర్యవేక్షకులు సునీల్‌నా యక్, తహసీల్దార్ శ్యాంలాల్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఆలే నరేంద్రకు ఘన నివాళి



నరేంద్ర చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ హరీష్‌బాబు

కాగజ్‌నగర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నాయకుడు ఆలే నరేంద్ర వర్ధంతి వేడుకలు హైదరాబాద్ బీజేపీ కార్యాలయంలో బుధవారం నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీ ష్ బాబు పాల్గొని నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీజేపీకి ఆలె నరేంద్ర ఎనలేని సేవలు అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్ర మంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రెబ్బెన: మండల కేంద్రంలో బుధవారం బీజేపీ నాయకుడు ఆలే నరేంద్ర వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళలుర్పించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు మల్రాజు రాంబాబు మాట్లాడుతూ బీజేపీ బలోపేతా నికి నరేంద్ర ఎనలేని సేవలు అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ కొలిపాక కిరణ్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కృష్ణకుమారి, అసెంబ్లీ కన్వీనర్ సొల్లు లక్ష్మి, అధికార ప్రతినిధి అంజనేయులు గౌడ్, మండల కన్వీనర్ పసుపులేటి మల్లేష్, మండల మధుకర్, రాజిరెడ్డి, నవీన్ గౌడ్, సచిన్ జైశ్వాల్, తులసి రాం తదితరులు పాల్గొన్నారు.

రాధాకృష్ణ మందిర్ హుండీ ఆదాయం రూ. రెండు లక్షలు

చింతలమానేపల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): చింతలమానేపల్లి మండలంలోని కర్జవెల్లి గ్రామంలోని ఓంకార ఆశ్రమం రాధాకృష్ణ మందిర్ వద్ద సీతారాముల కల్యాణ వార్షికోత్సవం సందర్భంగా వచ్చిన హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. మొత్తం రూ.2,01,640 ఆదాయం వచ్చినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గతేడాది కన్నా ఎక్కువ ఆదాయం వచ్చిందని, ఈ ఆదాయాన్ని ఆలయ అభివృద్ధికి ఉపయోగించ నున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శివరామస్వామి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తప్పుల తడకగా ఓటరు జాబితా

- పద్మశాలి సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి గుళ్లపల్లి నాగేశ్వర్ రావు



మాట్లాడుతున్న పద్మశాలి సంఘం నాయకుడు నాగేశ్వర్‌రావు

కాగజ్‌నగర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పద్మశాలి ఎన్నికల నిర్వహణలో ఓటరు జాబితా తప్పులతడకగా ఉందని పద్మశాలి సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్‌రావు తెలిపారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పద్మశాలి సంఘం ఎన్నికల్లో ఎంత మంది కుల సంఘ సభ్యులున్నారన్న ఇంత వరకు స్పష్టత లేదన్నారు. ఓటరు జాబితా రూపొందించినట్లు, ఇందులో ఖాళీల సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు పేర్కొన్నారు. పూర్తి స్థాయి ఓటరు జాబితా రూపొందించిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలని డిమాండు చేశారు. పద్మశాలి సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మాచర్ల శ్రీనివాస్ మాట్లాడుతూ పద్మశాలి కులస్థులు పూర్తిస్థాయిలో లేకుండానే ఎన్నికలు నిర్వహించడం సరికాదన్నారు. ప్రధానంగా పట్టణంలో ఎంత మంది పద్మశాలి సభ్యులు న్నారు..? వారి వివరాలు సేకరించి ఓటు హక్కు కల్పించిన తర్వాతనే ఎన్నికలు పెట్టాలన్నారు. అంతేకాని తప్పుల తడక ఓటరు జాబితాతో ఎన్ని కలు నిర్వహించటం సరికాదన్నారు. ఈ విషయాన్ని ఎన్నికల అధికారులు పరిశీలించాలని పేర్కొన్నారు. సమావేశంలో పద్మశాలి సంఘం నాయకు లు బోగ వెంకటేష్, మామిడాల రామకృష్ణ, దాసరి తిరుపతి పాల్గొన్నారు.

నవకార్ మహామంత్ర దినోత్సవం



పూజలు నిర్వహిస్తున్న జైన మతస్తులు

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని జైన దేవాలయంలో ప్రపంచ నవకార్ మహామంత్ర దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా జైన సమాజానికి చెందిన మహిళ లు, పురుషులు, యువతీయువకులు ఆలయంలో నవకార్ మహామంత్రాన్ని జరిపించారు. సార్వత్రిక విలువలను ప్రోత్సహించడానికి, వ్యక్తిగత, సామూహిక శ్రేయస్సు, శాం తి కోసం నవకార్ మహామంత్ర దినోత్సవాన్ని జరుపుకుం టామని జైనులు తెలిపారు.

'యువ వికాసం'ను సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్, ఏప్రిల్ 9 (ఆంధ్ర జ్యోతి): నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రాజీవ్ యువ వికాసం పథకాన్ని అర్హత గల మైనార్టీలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమ శాఖాధి కారి అబ్దుల్ నదం ఖుద్దుసీ సూచించారు. అర్హత గల అభ్యర్థు లు ఈ నెల 14వ తేదీలోగా ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాపాలన కేంద్రాల్లో సంబం ధిత ధ్రువపత్రాల నకలు పత్రా లతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

భారీ స్పందన

సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు ఏర్పాటు చేసిన రాజీవ్ యువ వికాస పథకానికి సిర్పూర్(టి) మండలంలో భారీ స్పందన లభిస్తోంది. మండలంలోని 16 గ్రామపంచాయతీల పరిధిలోని నిరుద్యోగ యువతీ యువకులు రుణాల కోసం దరఖాస్తు చేసు కుంటున్నారు. బుధవారం వరకు 400 వరకు దరఖాస్తులు వచ్చిన ట్లు ఎంపీడీవో సత్యనారాయణ తెలిపారు. ఈ నెల 14 వరకు గడువు ఉండడంతో దరఖాస్తుదా రుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ఆయన తెలిపారు. నిరుద్యోగ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కోరారు.

పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలి



ఆసిఫాబాద్‌లో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

ఆసిఫాబాద్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ప్రభుత్వం పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఖాళీ గ్యాస్ సిలిండర్లతో జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో సీపీఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు శ్రీనివాస్ మాట్లాడుతూ కేం ద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం గ్యాస్ ధరలు పెంచి సామాన్య ప్రజలపై పెనుభారం మోపిందన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు తగ్గుతుంటే దేశంలో ధరలు పెంచడం దారుహన్నారు. కార్యక్రమంలో నాయకులు కార్తీక్, మాలశ్రీ, టీకానంద్, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



లబ్ధిదారులతో ఎమ్మెల్యే కోవలక్ష్మి

వాంకిడి, ఏప్రిల్ 9 (ఆంధ్ర జ్యోతి): మండల కేంద్రం లోని తహసీల్దార్ కార్యాల యంలో ఎమ్మెల్యే కోవలక్ష్మి 91 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుపేద ఆడ పడుచులను ఆదుకోవడానికి గత టీఆర్ఎస్ ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీముబా రక్ పథకాలను అమలు చేసిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లో వస్తే కళ్యాణలక్ష్మి పథకంలో తులం బంగారం ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి మరిచి పోయారన్నారు. వెంటనే తులం బంగారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రియాజ్ అలీ, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బంది పెట్టడం సరికాదు



బీఆర్ఎస్‌లో చేరిన వారితో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

చింతలమానేపల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రైతులను అటవీ శాఖాధికారులు ఇబ్బం ది పెట్టడం సరికాదని బీఆర్ ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని కర్జవెల్లింలో రైతులతో సమా వేశమయ్యారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ రైతులకు అన్యాయం చేస్తే ఊర్కోమని హెచ్చరించా రు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన 50 మంది కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీ నర్ లహంచు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరగా వారికి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం బీఆర్ఎస్ మండల్యా క్షుడిగా రౌతు శేఖర్‌ను ఎన్నకున్నారు. నాయకులు లహంచు, రాజు, నవీన్, వరలక్ష్మి పాల్గొన్నారు.